

మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బలాల

50 మంది మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు ఉచిత కుట్టుశిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల తెలిపారు. మలక్‌పేట సలీంనగర్‌లోని సలీంఖాన్ కమ్యూనిటీహాల్‌లో జరిగిన కార్యక్రమంలో కుట్టుశిక్షణ పూర్తి చేసిన 50మంది మహిళలకు ఆయన ఉచితంగా సోలార్ కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. కుట్టుశిక్షణ అనంతరం ఉపాధి పొందుతున్న మహిళలను ఎమ్మెల్యే అభినందించారు. పలువురు మహిళలు కుట్టిన వివిధ రకాల డ్రెస్‌లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఐఎం మలక్‌పేట మహిళా ఇన్‌చార్జి నజీమాతోపాటు పలువురు పాల్గొన్నారు.



ఉత్సవ సమితి ప్రతినిధులకు చెక్కును అందజేస్తున్న పర్వతాల్‌రెడ్డి

బాలాపూర్ బడా గణేశుడి విగ్రహదాత పర్వతాల్‌రెడ్డి

- రూ.2.40లక్షల చెక్కు నిర్వాహకులకు అందజేత

సరూర్‌నగర్, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): లడ్డూ ప్రసాదంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు పొందిన బాలాపూర్ వినాయకుడి విగ్రహ దాతగా స్థానిక భక్తుడు పన్నాల పర్వతాల్‌రెడ్డి నిలుస్తున్నారు. కొన్నేళ్లుగా ఆయన విగ్రహదాతగా వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది సైతం ధూల్‌పేట్‌లో రూపుదిద్దుకున్న వినాయకుడి విగ్రహానికి రూ.2.40లక్షలు ఖర్చు కాగా సదరు మొత్తానికి సంబంధించిన చెక్కును ఆయన తన కుమారులు వంశీరెడ్డి, కిరణ్‌రెడ్డిలతో కలిసి శనివారం బాలాపూర్ ఉత్సవ సమితి ప్రతినిధులకు అందజేశారు. ఇక ముందు కూడా తాను ఈ సత్కార్యాన్ని కొనసాగిస్తానని పర్వతాల్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి, కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, ఉత్సవ నిర్వాహక ప్రతినిధులు వంగేటి లక్ష్మారెడ్డి, కళ్లెం ఎల్లారెడ్డి, టేకుల శశిధర్‌రెడ్డి, పన్నాల రాజేందర్‌రెడ్డి, టేకుల సుధాకర్‌రెడ్డి, పోరెడ్డి అరవింద్‌రెడ్డి, సంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కె.విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జన ఏర్పాట్లు పూర్తి : కొప్పుల

వనస్థలిపురం, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మన్సూరాబాద్‌లోని పెద్దచెరువు కొలను వద్ద నిమజ్జన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం పెద్దచెరువు పరిసర ప్రాంతాల్లో నిమజ్జనానికి తరలివచ్చే గణనాథులకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్పొరేటర్ స్వయంగా పిచ్చి మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను కాలనీవాసులతో కలిసి పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.



లక్ష్మారెడ్డిపాలెం కాలనీ నూతన కార్యవర్గం కమిటీ

లక్ష్మారెడ్డిపాలెం కాలనీ కార్యవర్గం నియామకం

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ లక్ష్మారెడ్డిపాలెం కాలనీ నూతన కార్యవర్గ కమిటీని కాలనీవాసులు ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ గౌరవ అధ్యక్షుడిగా రామ్మోహన్‌రావు, అధ్యక్షుడిగా గోవిందరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మజీద్‌బాబా, ఉపాధ్యక్షులుగా ఉయ్యాల శివనాగరాజు, రాజ్‌కుమార్, కార్యదర్శిగా వినోదరాజు, జాయింట్ సెక్రెటరీగా సంపత్‌గౌడ్, కోశాధికారిగా రవీందర్, కార్యవర్గ సభ్యులుగా అంజయ్య, శ్రీనాథ్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, చంద్రశేఖర్, శ్రీనివాస్‌రావులను ఎన్నుకున్నారు. కాలనీలోని సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం పేర్కొంది.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ

ఎల్‌బీనగర్, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్‌నగర్ కూరగాయల మార్కెట్‌లో హమాలీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ సరూర్‌నగర్ సర్కిల్ కన్వీనర్ ఎం.వీరయ్య డిమాండ్ చేశారు. ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌నగర్ కూరగాయల మార్కెట్‌లో హమాలీల సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కూరగాయల మార్కెట్‌లో తక్షణమే హమాలీలను గుర్తించాలన్నారు. హమాలి లోడింగ్, అన్‌లోడింగ్‌కు సరైన రేటు ఇవ్వడం లేదన్నారు. అధికారులకు రాతపూర్వకంగా వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ హమాలీలకు లైసెన్సులు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా హమాలీల సమస్యలను గుర్తించి తక్షణమే లైసెన్స్‌లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ఆర్‌కేపురం డివిజన్ నాయకులు ఎం. గోపీనాయక్, సీహెచ్ వెంకన్న, హమాలీలు శ్రీను, స్వామి, మల్లేష్, బాలరాజు, నర్సింహ, సలాఉద్దీన్, ఖాజా, మహేష్ పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

చంపాపేట, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): వినాయక నవరాత్రులను పురస్కరించుకొని విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి కోరారు. ఆదివారం చంపాపేట డివిజన్‌లోని శుభోదయకాలనీలో కార్పొరేటర్ పర్యటించి శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాన్ని పరిశీలించారు. బస్తీలో రెండు విద్యుత్ స్తంభాలను మార్చాలని ఆ శాఖ అధికారులను కోరారు. శోభాయాత్ర జరుగు ప్రాంతాల్లో విగ్రహాల తరలింపునకు ఆటంకం లేకుండా అడ్డుగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో బసంత్, నాగేష్, బాలు, సాయితేజ, కాలనీవాసులు నాగరాజు, రాజు, శంకర్ పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడికి ఘన సన్మానం

చంపాపేట, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌ను శనివారం టీపీసీ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్, సంయుక్త కార్యదర్శి మెట్టు వెంకట్‌రెడ్డి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. జితేందర్ మాట్లాడుతూ మహేష్‌కుమార్‌గౌడ్‌కు టీపీసీసీ పదవి రావడం ఎంతో సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సేవాదళ్ ఉపాధ్యక్షుడు వాజిద్ మెహక్, ప్రధాన కార్యదర్శి సద్గుణరావు, కార్యదర్శి బండి సురేందర్, శకుంతలరెడ్డి, సురేష్, శ్రీను, ప్రకాష్, కృష్ణ, సత్తయ్య పాల్గొన్నారు.

సరూర్‌నగర్ : టీపీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఆదివారం కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కేఎల్లార్, టీపీసీసీ ప్రచార కమిటీ కార్యవర్గ సభ్యుడు సామిడి గోపాల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సాయిచరణ్‌రెడ్డి తదితరులు కలిసి బొకే అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

- రూ. 1.21లక్షల నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం

వనస్థలిపురం, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను మహేశ్వరం ఎస్‌వోటి వనస్థలిపురం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం డివిజన్ ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఏపూరి నర్సింహులు(58), నాగోల్ డివిజన్ మమతనగర్‌కు చెందిన బల్లి శివాజీ(26), మన్సూరాబాద్ డివిజన్ శ్రీరామ హిల్స్‌కు చెందిన సంపంగి మధుసూదన్(35), నాగోల్ డివిజన్ సాయినగర్ కాలనీకి చెందిన సోమనోళ్ల సూర్యప్రకాష్(25), దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన లపంగి రవి(27)లు ఆదివారం వనస్థలిపురంలోని ప్రశాంత్‌నగర్‌కాలనీలో ఓ ఇంట్లో గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారు. ఈ మేరకు విశ్వాసనీయ సమాచారం అందుకున్న మహేశ్వరం ఎస్వోటి పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్ట్‌చేసి వారి వద్ద రూ. 1,21,000 నగదు, ఐదు సెల్ ఫోన్లు సీజ్ చేశారు. వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



సరూర్‌నగర్ చౌరస్తాలో గణేశ్ పూజలో కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్ దంపతులు, పండరి దంపతులు



వనస్థలిపురంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కాలనీవాసులు



న్యూమారుతీనగర్‌లో వినాయకుడిని దర్శించుకున్న కార్పొరేటర్ పవన్‌కుమార్ తదితరులు



చంపాపేటలోని కుమ్మరిబస్తీలో మండపంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

భక్తి శ్రద్ధలతో గణేశ్ ఉత్సవాలు

జోన్ బృందం : ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్ జోన్ పరిధిలో శనివారం, ఆదివారం గణేశ్ నవరాత్రి ఉత్సవాలను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. బాలాపూర్‌లో అయోధ్య బాలరాముడి ఆలయ నమూనాలో నిర్మించిన మండపంలో కొలువుదీరిన లంబోదరుడి వద్ద శనివారం సాయంత్రం ఉత్సవ సమితి



బాలాపూర్ గణపయ్యను దర్శించుకున్న మేయర్ పారిజాతానర్సింహారెడ్డికి లడ్డూ అందజేస్తున్న ఉత్సవ సమితి సభ్యులు

ఆధ్వర్యంలో తొలి పూజలు నిర్వహించగా.. అనంతరం మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి లడ్డూ ప్రసాదం అందజేశారు. ఎమ్మెల్యే సబితారెడ్డి బడంగ్‌పేట్‌లో వీరాంజనేయ భక్త సమాజం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన బడా వినాయకుడిని దర్శించుకోగా నిర్వాహకులు ఆమెను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని అల్కాపురిలో అల్కాపురి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుని తొలి పూజలో మాజీ కార్పొరేటర్ దేప సురేఖ భాస్కర్‌రెడ్డి, పిట్టా సుమతి హరినాథ్‌రెడ్డి దంపతులతో పాటు కాంగ్రెస్ నాయకులు, చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో వినాయక మండపంలో ఆలయ ఇన్‌చార్జి ఈఓ ప్రేమ్‌కుమార్‌రావు, ఆలయ మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, నల్గొండ గద్దర్, గాయకుడు నర్సిరెడ్డి వినాయకస్వామికి పూజలు చేశారు. చంపాపేటలోని కుమ్మరిబస్తీలోని కమ్యూనిటీహాల్‌లో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిల్వేరు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు



బాలాపూర్ వినాయకుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే సబితారెడ్డికి లడ్డూ అందజేస్తున్న ఉత్సవ సమితి అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి తదితరులు

చేసి అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హస్తినాపురం డివిజన్‌లోని విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్ కాలనీలో వినాయక చవితిని పురస్కరించుకొని కాలనీ అధ్యక్షుడు దోర్నాల విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాతానాయక్, తెలంగాణా సారస్వత పరిషత్తు ప్రిన్సిపాల్ అజ్మీరా సిల్కానాయక్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ సిల్కా, యోగా గురువు విజయ ప్రతాప్ మహారాజ్, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్ టి.సురేందర్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రజలకు వినాయకులను పంపిణీ చేశారు.



పెద్దఅంబర్‌పేట్‌లో వినాయకుడి పూజలో కౌన్సిలర్ అనురాధాసురేష్ తదితరులు



శ్రీకృపా మార్కెట్‌లో పూజలు చేస్తున్న అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు వెంకటరమణ, వినోద్‌కుమార్ తదితరులు



అల్కాపురిలో పూజల్లో మాజీ కార్పొరేటర్ దేప సురేఖ భాస్కర్‌రెడ్డి, పిట్టా సుమతి హరినాథ్‌రెడ్డి దంపతులు



సైదాబాద్ విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ గణనాథుడిని దర్శించుకున్న ఉత్సవ కమిటీ సభ్యులు

బీఆర్ఎస్ హయాంలోనే ముంపు సమస్యను పరిష్కరించాం

- ఎమ్మెల్యే సబితారెడ్డి వెల్లడి

సరూర్‌నగర్ : బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడలో గతంలో వర్షం వస్తే అనేక కాలనీలు ముంపునకు గురయ్యేవని, బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో తాను కేసీఆర్, కేటీఆర్ సహకారంతో ఎస్ఎన్‌డీపీ నాలాల నిర్మాణానికి శ్రీకారం చుట్టి ఆ సమస్యను శాశ్వతంగా దూరం చేశానని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆమె అల్మాస్‌గూడలో పర్యటించి ఎస్ఎన్‌డీపీ నాలాను పరిశీలించారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడుతూ గతంలో చిన్నపాటి వానకే ఇక్కడి అనేక కాలనీలు నీటిలో చిక్కుకునేవని, నేడు ఎంత పెద్ద వాన వచ్చినా వరద నీరు సాఫీగా దిగువకు వెళ్లి పోతున్నదని అన్నారు. సదరు నాలా నిర్మాణానికి రూ.14కోట్లు వెచ్చించామని, త్వరలోనే కోమటికుంట నుంచి పెద్దచెరువు వరకు మరో రూ.9కోట్లతో ఇంకో ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణం చేపట్టనున్నట్టు ఆమె తెలిపారు. కాగా తమను ముంపు సమస్య నుంచి దూరం చేసిన సబితకు స్థానిక కాలనీలవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సత్కరించి స్వీటు తినిపించారు. కార్యక్రమంలో అల్మాస్‌గూడ కార్పొరేటర్లు రామిడి మాధురీవీరకర్ణారెడ్డి, సంరెడ్డి స్వప్నావెంకట్‌రెడ్డి, బోయపల్లి దీపికాశేఖర్‌రెడ్డి, ముత్యాల లలితాకృష్ణ, ఏనుగు రాంరెడ్డి, రామిడి కవితారాంరెడ్డి పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని పలు డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను సోమవారం జిల్లెలగూడ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితారెడ్డి పాల్గొని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆహుతైన గణనాథుని మండపం

- ప్రమాదవశాత్తు చెలరేగిన మంటలు

దిల్‌సుఖ్‌నగర్, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు గణనాథుని మండపంలో మంటలు చెలరేగి గణేశ్ మండపం అగ్నికి ఆహుతైన సంఘటన దిల్‌సుఖ్‌నగర్‌లో చోటు చేసుకుంది. గణనాథుని మండపాన్ని విభిన్నరీతిలో అలంకరించడం కోసం దిల్‌సుఖ్‌నగర్ పీ అండ్ టీ కాలనీలో శ్రీ విఘ్న హర్త ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపంలో పత్తితో మండపాన్ని అలంకరించారు. శనివారం రాత్రి ఏకదంతున్ని ప్రతిష్ఠించి తొలిపూజ నిర్వహించేందుకు అన్ని సిద్ధం చేశారు. రాత్రి 8.30 గంటల సమయంలో పూజలు ప్రారంభించారు. ఆ సమయంలో దీపాలు వెలిగించగా ప్రమాదవశాత్తు పత్తి అలంకరణకు దీపం అంటుకోవడంతో క్షణాల వ్యవధిలో మండపం మొత్తం మంటలు వ్యాపించాయి. మండపంలో పూజలు చేస్తున్న మహిళలు, భక్తులు మంటలను చూసి అప్రమత్తమై వెంటనే మండపంలో నుంచి బయటకు పరుగుతీశారు. క్షణాల్లో మంటలు మొత్తం వ్యాపించడంతో మండపం అగ్నికి ఆహుతైంది. మండపంలో ఉన్న వారంతా చాకచక్యంగా వ్యవహరించడంతో ఎవరికి ఎలాంటి హాని జరగలేదు. ఐదు నిమిషాల ముందే మండపం వద్ద ఉన్న చిన్నారులు ఇంటికి వెళ్లిపోయారని నిర్వాహకులు తెలిపారు. గణపయ్య అనుగ్రహంతో పెనుముప్పు తప్పిందని నిర్వాహకులు ఊపిరి పీల్చుకున్నారు. మండపం అగ్నికి ఆహుతవడంతో గణనాథుని విగ్రహాన్ని తీసుకుని వెళ్లి సరూర్‌నగర్ చెరువులో నిమజ్జనం చేశారు.



మండపంలో చెలరేగుతున్న మంటలు



5	2023KL15 1170787	Yadalah Barla Meghana/ Barla Madhusudhan	Meerpet	9849266592	H.NO. 3-193/2/1, PLOT NO 737,NANDI HILLS	9	Barla Bhagyalatha

కల్యాణలక్ష్మి లబ్ధిదారుల జాబితాలో బర్ల మధుసూదన్, భాగ్యలతల కుమార్తె మేఘన పేరు

'కల్యాణలక్ష్మి'లో కమీషన్ల దందా!

- పది వేలు కమీషన్ తీసుకుని అనర్హులకు చోటు
- ప్రభుత్వ ఉపాధ్యాయురాలి కుమార్తెకు ఆర్థికసాయం
- ఎమ్మెల్యే చేతులమీదుగా అందుకున్న టీచర్ భర్త



ఎమ్మెల్యే సబితారెడ్డి నుంచి భాగ్యలతకు బదులు కల్యాణలక్ష్మి చెక్కు అందుకుంటున్న ఆమె భర్త మధుసూదన్

సరూర్‌నగర్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పేదలకు దక్కాల్సిన కొన్ని సంక్షేమ పథకాలు దళారుల కమీషన్ల దందాతో పక్కదారి పడుతున్నాయి. ఇందులో కల్యాణ లక్ష్మి పథకం ఒకటి. ఈ పథకం కింద పేద కుటుంబాల్లో ఆడపిల్లల పెళ్లికి లక్షా నూట పదహారు రూపాయల ఆర్థిక సాయం అందిస్తారు. అయితే కొందరు నేతలు పదివేల దాకా కమీషన్ తీసుకుని అనర్హులకు ఆర్థిక సాయం మంజూరు చేయిస్తున్నట్టు తెలుస్తోంది. మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ కార్పొరేషన్‌లో తాజాగా ఓ ప్రభుత్వ ఉద్యోగి కూతురికి కల్యాణలక్ష్మి ఆర్థిక సాయం మంజూరు కావడం చర్చనీయాంశంగా మారింది. నగర శివారులోని ఓ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసే మీర్‌పేట్ నంది హిల్స్ కాలనీకి చెందిన మిద్దెల భాగ్యలత కూతురు మేఘన వివాహం గత నవంబరులో జరిగింది. భాగ్యలత ప్రభుత్వ ఉద్యోగి (టీచర్). ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆమె ఓటు హక్కు (ఐడీ నంబర్: వైయూవో 3269198) వినియోగించుకున్నట్టు ఓటరు జాబితాను బట్టి స్పష్టమవుతోంది. నిబంధనల ప్రకారం వీరికి కల్యాణలక్ష్మి పథకం వర్తించదు. కానీ కొందరు స్థానిక బీఆర్ఎస్ నేతలు దొడ్డిదారిలో పైరవీ చేసి వారికి ఆర్థిక సాయం (2023కేఎల్ 151170787) మంజూరు చేయించారు. ఇందుకు రూ.పది వేలు కమీషన్ తీసుకున్నట్టు స్థానికంగా ప్రచారం జరుగుతోంది.

'ఆమె'కు బదులుగా 'ఆయన'


సాధారణంగా కల్యాణలక్ష్మి పథకం చెక్కులు పెళ్లికూతురి తల్లి పేరు మీద మంజూరవుతాయి. కాబట్టి తల్లే తీసుకోవాల్సి ఉంటుంది. మేఘనకు ఆమె తల్లి భాగ్యలత పేరు మీద చెక్కు రాగా.. తండ్రి బర్ల మధుసూదన్ (భాగ్యలత భర్త) మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి చేతుల మీదుగా అందుకోవడం గమనార్హం! గతంలో ఆమె తన బదిలీ కోసం అప్పుడు మంత్రిగా ఉన్న సబితా ఇంద్రారెడ్డి వద్దకు పలుమార్లు వెళ్లినట్టు సమాచారం. దాంతో ఆమెను సబిత గుర్తు పట్టే అవకాశం ఉందని గ్రహించిన మధ్యవర్తులు భాగ్యలతకు బదులు ఆమె భర్తను ఇటీవల మీర్‌పేట్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి తీసుకెళ్లి సబితారెడ్డితో చెక్కు అందించడం గమనార్హం. బాలాపూర్ రెవెన్యూ కార్యాలయంలోని కొందరు కింది స్థాయి సిబ్బంది లంచాలు తీసుకుని ఇలా పైరవీకారులకు ఆర్థిక సాయం మంజూరు చేయిస్తున్నట్టు తెలిసింది.

> **విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం**
>
> నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు కల్యాణలక్ష్మి పథకం వర్తించదు. మీర్‌పేట్‌లో ఓ టీచర్ కూతురికి ఆర్థిక సాయం అందినట్టు కొందరు నా దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటాం. ఇందులో తమ సిబ్బంది పాత్ర ఉంటే వారిపైనా చర్యలు తప్పవు.
>
> - ఇందిరాదేవి, తహసీల్దార్, బాలాపూర్ మండలం

కరాటే ఉచిత శిక్షణ తరగతులు

ఎల్‌బీనగర్, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): విశ్వహిందు పరిషత్, జై శ్రీరాం వివేకానంద జిల్లా మాతృశక్తి ఆధ్వర్యంలో బాలికల స్వీయ రక్షణ కోసం ఉచిత కరాటే తరగతులను ఆదివారం కొత్తపేట రామకృష్ణపురంలోని వి.డి. ప్రసాద్ స్కూల్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాతృశక్తి సంయోజక లత, కార్యకర్త ఇందిర, ప్రచార ప్రముఖ్ రుక్మిణి, విభాగ్ సంయోజక జ్యోతి, మాలతి, బిందు తదితరులు పాల్గొన్నారు. కరాటే శిక్షకులుగా విశ్వాస్, రాజేష్ ఉన్నారు. ప్రతి ఆదివారం తరగతులు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

సైబర్ నేరాల నివారణపై వెబ్ పోస్టర్‌తో సీ డాక్ అవగాహన



ఐఎస్ఈఏ రూపొందించిన గణపతి సూచనల వెబ్‌పోస్టర్

కొత్తపేట: కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ వారి హైదరాబాద్ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్(సీ - డాక్) ఇన్‌ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్(ఐఎస్ఈఏ) ప్రాజెక్టు సైబర్ నేరాల నివారణపై శనివారం వినాయక చవితి పర్వదినాన వెబ్‌పోస్టర్ విడుదల చేసింది. ఈ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా సైబర్ నేరాల నివారణ, సైబర్ భద్రత ప్రాధాన్యతలపై వినూత్న రీతుల్లో ఐఎస్ఈఏ నిపుణులు దేశవ్యాప్తంగా తమ వెబ్‌సైట్, సోషల్ మీడియాల ద్వారా, పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సైదాబాద్ : రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన సైదాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. చంపాపేట బృందావన్ కాలనీలో నివాసముండే తాండ్ర ఐలయ్య(60) శుక్రవారం రాత్రి చంపాపేట ఎంఎస్ఆర్ గార్డెన్స్ ముందు నడుచుకుంటూ రోడ్డు దాటుతున్నాడు. ఇంతలో వేగంగా బైక్‌పై వచ్చిన యువకుడు అతడిని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నెయిల్ కట్టర్ కత్తితో యువకుడిపై దాడి

హయత్‌నగర్, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి టిఫిన్ చేస్తున్న యువకుడిపై తాగిన మైకంలో మరో యువకుడు నెయిల్ కట్టర్ కత్తితో దాడి చేసిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. హయత్‌నగర్ ప్రియదర్శిని కాలనీలో నివాసం ఉండే కొలన్ సాయికుమార్‌గౌడ్(22) బీటెక్ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. శనివారం రాత్రి హయత్‌నగర్ సాయిబాబా ఆలయం పక్కన ఉన్న రాఘవేంద్రహోటల్ వద్ద సాయికుమార్‌గౌడ్ నలుగురు స్నేహితులతో కలిసి టిఫిన్ చేస్తున్నాడు. అదే సమయంలో తొర్రూర్ రాజీవ్‌గృహకల్ప శ్రీనగర్‌కాలనీలో నివాసం ఉండే సుధీర్ అతని స్నేహితులు శ్రీను, వంశీతో కలిసి అక్కడికి వచ్చాడు. టిఫిన్ సెంటర్ వద్దనే ఇద్దరి మధ్య స్వల్ప వివాదం జరిగింది. దీంతో తాగిన మైకంలో ఉన్న సుధీర్ తన వద్ద ఉన్న నెయిల్ కట్టర్ కత్తితో సాయికుమార్‌గౌడ్ వీపులో పొడిచాడు. వెంటనే సుధీర్ అతని స్నేహితులు అక్కడి నుంచి పారి పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని సాయికుమార్‌గౌడ్‌ను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు సుధీర్ అతని స్నేహితుడు శ్రీనును గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వంశీ పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. సాయికుమార్‌గౌడ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులు అరెస్ట్ చేస్తారన్న భయంతో వ్యక్తి ఆత్మహత్య

సైదాబాద్, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): పోలీసులు అరెస్ట్ చేస్తారన్న భయంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన మాదన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. యాఖత్‌పురా ఎస్ఆర్‌టీ కాలనీలో నివాసముండే మహ్మద్ యూనుసుద్దీన్(50) సేల్స్‌మెన్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆజంపురాలో ఉండే వీరి సోదరి కుమారుడు షేక్ కైఫ్(19) ఓ బాలికను వారి ఇంట్లో తెలియకుండా తీసుకెళ్లిపోయాడు. దీంతో రెయిన్‌బజార్ పీఎస్‌లో పోక్సో కేసు నమోదైంది. ఈ క్రమంలో బాలిక ఆచూకీ కోసం ఆమె తల్లి పలు మార్లు యూనుసుద్దీన్‌కు ఫోన్‌చేసి వాకబు చేసింది. చివరకు శుక్రవారం రాత్రి యూనుసుద్దీన్‌కు ఫోన్ చేసి తమ కూతురి జాడ చెప్పమని లేకుంటే పోలీసులు వచ్చి నిన్ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్తారని బెదిరించింది. దీంతో భయాందోళనతో మనస్తాపానికి గురైన యూనుసుద్దీన్ శనివారం ఉదయం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు మాదన్నపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్నాడని సోషల్ మీడియాలో వైరల్ అవడంతో స్థానికంగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఘటనా స్థలానికి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ సందర్శించి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆత్మహత్యపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తేవాలని ఎమ్మెల్యే కోరారు.



యూనుసుద్దీన్

ఆత్మహత్యపై వదంతులు నమ్మవద్దు : ఏసీపీ

రెయిన్‌బజార్ పోలీసుల వేధింపుల వల్లే యూనుసుద్దీన్ ఆత్మహత్య చేసుకున్నట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో వాస్తవం కాదని మీర్‌చౌక్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు స్పష్టం చేశారు. మృతుడి మేనల్లుడు షేక్ కైఫ్‌పై రెయిన్‌బజార్ పీఎస్‌లో పోక్సో చట్టంలో నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ అయిందని తెలిపారు. ఆ క్రమంలోనే రెయిన్‌బజార్ కానిస్టేబుల్ మృతుడి ఇంటికి వెళ్లి వాకబు చేయడం జరిగిందని అన్నారు. ఆత్మహత్యకు పోలీసులకు ప్రమేయం లేదని, వేధింపులు లేవని వివరించారు. కొందరు అవగాహన లేకుండా ప్రజలను తప్పుదారి పట్టించేవిధంగా వీడియోలు వైరల్ చేయడం మంచిది కాదని పేర్కొన్నారు.



సఫీల్‌గూడ చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు, డీసీపీ పద్మజ తదితరులు

నిమజ్జనం సజావుగా సాగాలి : సీపీ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): రాచకొండ పరిధిలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు సజావుగా సాగేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని సీపీ సుధీర్‌బాబు పేర్కొన్నారు. నిమజ్జన ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా ఆదివారం ఎదులాబాద్, కాప్రా, సఫీల్‌గూడ చెరువులను సందర్శించారు. అక్కడ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం అధికారులతో మాట్లాడి వారికి దిశానిర్దేశం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా నిమజ్జనం జరిగే చెరువులు, కుంటల వద్ద క్రేన్లు, బారికేడ్లు, మంచి నీటి వసతి, గజ ఈతగాళ్లు, లైటింగ్ వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. నిమజ్జనానికి సంబంధించిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించామని ఈసారి మరింత కట్టుదిట్టమైన భద్రత చర్యలతో నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సీపీ వెంట డీసీపీ పద్మజతోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.